తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగియడంతో టీటీడీ పాలకమండలి, అధికార యంత్రాంగం ఆనందంగా ఉన్నాయి. విజయవంతం చేశారంటూ ఏకంగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేయడం విశేషం. ఈ విజయం వెనుక మూడు నెలల ముందస్తు కృషి ఉంది. బ్రహ్మోత్సవాల ముందు బదిలీ అయిన ఈవో శ్యామలరావు, తండ్రి కన్నుమూయడంతో హాజరుకాలేకపోయిన అదనపు ఈవో వెంకయ్యచౌదరిల పాత్ర చాలా ఉంది. ప్రస్తుత ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కు అయిదు బ్రహ్మోత్సవాలను నిర్వహించిన అనుభం ఉండడం, ముఖ్య అధికారులందరికీ గత బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగం అయిన అనుభవం ఉండడం ఈసారి చిన్న అవాంతరం కూడా లేకుండా విజయవంతం కావడానికి కారణమయ్యాయి. ముఖ్యంగా ఈసారి రాజకీయ హడావుడి లేకపోవడం ప్రత్యేకం. ఆ శ్రీనివాసుడే వెనుక ఉండి నడిపించాడని అందరూ ఆనందంగా ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రశాంతం

దిగ్విజయం

● ముగిసిన బ్రహ్మోత్సవాలు



తోపులాటల్లేని గరుడోత్సవం

బ్రహ్మోత్సవాల్లో పాలకమండలీ, అధికారులూ అత్యంత టెన్షన్‌గా ఉండేది గరుడోత్సవం రోజు. లక్షల మంది జనం ముందే కొండమీదకు చేరుకుంటారు. వీరిలో స్థానికుల సంఖ్య గణనీయంగా ఉంటుంది. వీరికి నీరు, ఆహారం, మరుగుదొడ్ల సౌకర్యం వంటివి లోటు లేకుండా కల్పించాలి. గ్యాలరీల్లోకి ప్రవేశించే సమయంలో తోపులాటలకు అవకాశం ఉంటుంది.

2024లో ముందస్తు ప్రణాళికతో తోపులాటరహిత గరుడోత్సవం రాఘవేంద్రస్వామి మఠానికి సమీపంలో ఏర్పాటు చేసిన అదనపు క్యూలైన్ల ప్రవేశంలో తీవ్రస్థాయిలో తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది టీటీడీ పక్కా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించింది. గ్యాలరీల్లో 2 లక్షల మంది, అదనపు క్యూలైన్లు, రీఫిల్లింగ్ ద్వారా మరో 40 వేల నుంచి 45 వేల మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. శ్రీవారి మూలవిరాట్టు దర్శనానికి మరో 50 వేల మందికి అవకాశం ఉంటుంది. ఇలా 3 లక్షల మందికంటే తిరుమలకు అధికంగా వస్తే ఇబ్బందులు తలెత్తుతాయని అంచనా వేశారు. 28న జరిగిన గరుడవాహనానికి కౌడ్ మెనెజ్మెంట్ సిస్టమ్‌ను అమలుచేసి సక్సెస్ అయ్యారు. తిరుమలకు దాదాపు 3 లక్షల మంది భక్తులు చేరిపోయారని నిర్ధారించుకున్న తర్వాత ఆరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆర్టీసీ బస్సులు మినహా మరే ఇతర వాహనం తిరుమలకు రాకుండా చర్యలు తీసుకున్నారు. కార్లను అలిపిరి వద్దే ఆపేసి, బస్సులు ఏర్పాటు చేశారు. బస్సుల సంఖ్యను కూడా తగ్గించి నెమ్మదిగా వచ్చేలా ప్లాన్ చేశారు. దీంతో పోటెత్తి పరుగులు తీసే అవసరం కనిపించలేదు. ఫలితంగా తోపులాటరహిత గరుడోత్సవాన్ని నిర్వహించగలిగారు.

అనుభవమే పాఠాలుగా..

గత అనుభవాల నిర్వహణలో అనుభవం ఉన్న అధికారుల ప్రణాళికాబద్ధ కృషి. ఈఏడాది బ్రహ్మోత్సవాల దిగ్విజయం వెనుక కనిపిస్తోంది. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ గతంతో ఐదు బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అలాగే అదనపు ఈవో వెంకయ్య చౌదరి కూడా గత బ్రహ్మోత్సవంలో లోటుపాట్లను గమనించిన అధికారే. ఇక, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు పాత వారే కావడంతో గతకాలపు లోటుపాట్లను సమీక్షించుకుని ఈసారి వాటన్నింటికీ చెక్ పెట్టగలిగారు. టీటీడీలో గతంలో పనిచేసిన అధికారులు, కీలక బాధ్యతలు నిర్వహించిన సిబ్బంది, కొందరు భక్తులు, మీడియా నుంచి ముందస్తుగా సేకరించిన సమాచారంతో సమర్థవంతమైన ఏర్పాట్లు చేసి సక్సెస్ అయ్యారు. భక్తుల నుంచి ఆకలి అనే మాట వినిపించకుండా నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, మజ్జిగ అందజేసి శభాష్ అనిపించుకున్నారు.

ఆ ఇద్దరి కృషి...

ఈఏడాది బ్రహ్మోత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలనే లక్ష్యంతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి మూడునెలలుగా విశేషంగా కృషి చేశారు. అన్ని విభాగాలతో దఫాల వారీగా సమీక్షలు నిర్వహించి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాలు ప్రారంభానికి ముందురోజు వరకు సూక్ష్మస్థాయిలో ఏర్పాట్లపై చర్చించారు. దురదృష్టవశాత్తు ధ్వజారోహణం రోజే ఆయన తండ్రి చలమయ్య కన్నుమూయడంతో బ్రహ్మోత్సవాలకు దూరంకావాల్సి వచ్చింది. ఈ సమీక్షల్లో, ఏర్పాట్లలో బ్రహ్మోత్సవాల ముందు బదిలీపై వెళ్లిన ఈవో శ్యామలరావు పాత్ర కూడా చాలానే ఉంది.

వీఐపీల హడావుడి లేదు

సాధారణంగా బ్రహ్మోత్సవాల్లో రాజకీయ నాయకుల హడావుడి చాలానే ఉంటుంది. వారి బంధువులు, మిత్రులు, అనుచరులు చేసే హంగామా సాధారణ భక్తులకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు వారిని వారించలేక సతమతం అవుతూ ఉంటారు. ఈ ఏడాది మాత్రం వీఐపీల హడావుడి పెద్దగా కనిపించలేదు. హైకోర్టు న్యాయమూర్తులు, ఓ రాష్ట్ర మంత్రి మినహా మిగిలివారెవ్వరు వాహనాల ముందు లేకపోవడంతో వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి.

పెరిగిన ఆర్టీసీ సేవలు

2023 బ్రహ్మోత్సవాల్లో (ఎనిమిది రోజుల్లో) 5.5 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, గతేడాది 6 లక్షల మందికి దర్శనం లభించింది. కాగా, ఈఏడాది ఎనిమిదిరోజుల్లో 5.80 లక్షల మంది దర్శించుకున్నారు. ఇక హుండీ ఆదాయం 2023లో రూ.24 కోట్లు, 2024లో రూ.26 కోట్లు లభించగా ఈఏడాది రూ.25.12 కోట్లు లభించింది. ఇక ఆర్టీసీ సేవలు ఈ ఏడాది రికార్డు సృష్టించాయి. గతేడాది గరుడసేవ రోజున 1.86 లక్షల మంది తిరుమల-తిరుపతి మధ్య ప్రయాణించగా, ఈ ఏడాది రికార్డుస్థాయిలో 2.16 లక్షల మంది ఆర్టీసీ బస్సులను వినియోగించుకున్నారు.

కళల పండుగ.. కనుల నిండుగ

ఈసారి బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈశాన్య రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు దక్షిణాదికి ఈ బ్రహ్మోత్సవాలు పరిచయం చేశాయి. గతేడాది 18 రాష్ట్రాల నుంచి 6,884 మంది కళాకారులు ప్రదర్శనలు ఇవ్వగా, ఈ ఏడాది అత్యధికంగా 28 రాష్ట్రా నుంచి 6,060 మంది కళాకారులు వాహనాల ముందు ప్రదర్శనలిచ్చారు.

ఫల, పుష్ప ప్రదర్శనలో కొరవడిన కొత్తదనం

కల్యాణవేదికలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన శాలకు భక్తులు భారీ సంఖ్యలోనే హాజరయ్యారు. అయితే కొత్తదనం కొరవడిందనే వ్యాఖ్యలు వినిపించాయి. నాలుగైదేళ్లుగా చేసిన అలంకరణలకు దగ్గరగానే ఈ ఏడాది కూడా ఉన్నాయి. శ్రీకృష్ణలీలల చిత్రాలు కొంత ఆకట్టుకున్నాయి. ప్రతి ఏడాదీ స్థానిక చిత్రకారులతో ఏదో ఒక అంశం మీద చిత్రాలు వేయించి ప్రదర్శనలో ఉంచితే మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

రాజరాజేశ్వరి దేవిగా బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):బోయకొండ దసరా ఉత్సవాల్లో గురువారం రాజరాజేశ్వరి దేవిగా గంగమ్మ దర్శనమిచ్చారు.రెండు చేతుల్లో శంఖుచక్రాలు, ఒక చేతిలో చిలుక , మరో చేతిలో చెరకు గడలతో రాజరాజేశ్వరీదేవిగా గంగమ్మను అలంకరించి ధూపదీపనైవేద్యాలు సమర్పించారు.





రాజకీయ దుమారం

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు

మీరంటే మీరే కారణమంటూ టీడీపీ, వైసీపీ ఆరోపణలు

రోజంతా ఆందోళనలతో హోరెత్తిన దేవళంపేట

7లో

నేడు 'ఆటో డ్రైవర్ సేవలో'

6777 మంది ఆటో డ్రైవర్లకు రూ.10.16 కోట్ల లబ్ధి

7లో

స్వచ్ఛ అవార్డుల పంట

● రాష్ట్రస్థాయిలో ఆరు.. జిల్లాస్థాయిలో 48

● ప్రజల్లోనూ స్వచ్ఛతపై బాధ్యత పెరగాలన్న కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రలో చిత్తూరు జిల్లా మరో ముందడుగు వేసిందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో జిల్లా మంచి స్థానాన్ని కైవసం చేసుకుంది.మొత్తం 16 విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ఆరు అవార్డులను కైవసం చేసుకోగా, జిల్లాస్థాయిలో 48 అవార్డులను గెలుచుకుంది. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ మీడియాకు అవార్డుల వివరాలు వెల్లడించారు.అధికారులే కాకుండా శానిటరీ వారియర్స్, గ్రీన్ అంబాసిడర్స్ సైతం బాధ్యతగా పనిచేయడం వల్లే ఇన్ని స్వచ్ఛత అవార్డులు వచ్చాయన్నారు.అయితే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సేవలు మరింత మెరుగుపడాలన్న ఆయన ప్రజలంతా కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ లాంటి వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త కుండీల్లో వేసి శానిటరీ వారియర్స్‌కు సహకరించాలన్నారు. చాలా చోట్ల సిబ్బంది కొరత, వయస్సు పైబడిన వారు శానిటరీ వారియర్స్‌గా ఉన్న కారణంగా గ్రామ, మున్సిపాలిటీ సరిహద్దు ప్రాంతాల్లో చెత్త సేకరణ కొంత ఆలస్యమవుతోందన్నారు.కూడళ్లలో పాడైన చెత్త కుండీలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, శానిటరీ వారియర్స్ కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు.సోమవారం రాష్ట్రస్థాయి అవార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో అందజేస్తారని,అదేరోజున జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా కేటగిరి అవార్డులు అందిస్తామని చెప్పారు.



స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రకటనకు ముందు గాంధీ చిత్రపటానికి కలెక్టర్ నివాళి

రాష్ట్రస్థాయిలో అవార్డులు

మున్సిపాలిటీ	పలమనేరు, కుప్పం
పంచాయతీ	కెనమాకులపల్లె, శాంతిపురం
అంగన్‌వాడీ	కామినాయనిపల్లె, ఐరాల
ప్రభుత్వ కార్యాలయం	కడ,కుప్పం
బస్ స్టేషన్	చిత్తూరు

జిల్లా స్థాయిలో అవార్డులు

కేటగిరి	అవార్డులు పొందినవి
మున్సిపాలిటీ	పుంగనూరు మున్సిపాలిటీ
అంగన్‌వాడీ	ఇరికిపెంట, సోమల మండలం, అగరమంగళం, జీడీ నెల్లూరు మండలం బందార్లపల్లి, రామకుప్పం మండలం, మహాసముద్రం, బంగారుపాళ్యం మండలం
ప్రభుత్వ కార్యాలయాలు	జిల్లా పరిషత్ కార్యాలయం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ)
భారీ పరిశ్రమలు	సాహి ఎక్స్‌పోర్ట్స్ , చిత్తూరు
పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)	రవాండ్స్ పాస్టిక్, విశ్వ అప్పారెల్స్
వసతి గృహాలు	సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, నగరి బీసీ కాలేజ్ బాలికల వసతి గృహం, కుప్పం గిరిజన కళాశాల బాలుర వసతి గృహం, కుప్పం
రెసిడెన్షియల్ స్కూల్	అంబేడ్కర్ బాలికల గురుకులం, సర్వేరెడ్డిపల్లి, జీడీ నెల్లూరు మండలం
ఆస్పత్రులు	పీహెచ్‌సీ, కొత్తపల్లి, కుప్పం ఏరియా ఆస్పత్రి, పలమనేరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు
పాఠశాలలు	ఏపీఎంఎస్, తుమ్మిశి, శాంతిపురం మండలం కేజీబీవీ, బైరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్, బీరప్పచెరువు, ఐరాల ఎంపీపీఎస్, కమ్మపల్లి, పులిచర్ల మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంగారుపాళ్యం
శానిటేషన్ వారియర్స్	పి.వెంకటేష్, చిత్తూరు ఎస్.శ్రీనివాసులు, పలమనేరు డి.రవిచంద్రన్, నగరి టి.గంగమ్మ, కుప్పం టి.హరిబాబు, పుంగనూరు
గ్రీన్ అంబాసిడర్స్	విజయకుమార్, అగరంపల్లె, ఐరాల ఎం.బాలకృష్ణ, పెద్దచల్లారగుంట,బైరెడ్డి పల్లె టి.నాగరాజు, పెద్దచల్లారగుంట,బైరెడ్డి పల్లె పి.సావిత్రి, తూర్పు మాదిగవాడ,కార్వేటినగరం ఎస్.బాలకృష్ణ, కొలమాసనపల్లె,పలమనేరు
పంచాయతీలు	యామగానిపల్లె, గుడుపల్లె మండలం కాణిపాకం, ఐరాల కంగుంది, కుప్పం మల్లానూరు, కుప్పం
స్లమ్ లెవల్ ఫెడరేషన్స్	పొన్నియమ్మ మహిళా సమాఖ్య, నగరి శ్రీ ఆంజనేయ మహిళా సమాఖ్య, నగరి శ్రీ ఇరుపాక్షి మహిళా సమాఖ్య, చిత్తూరు
రైతు బజార్	కుప్పం అగ్రికల్చర్ మార్కెట్, కుప్పం
విలేజ్ ఆర్గనైజేషన్స్	గడ్డంవారిపల్లె, చౌడేపల్లె మండలం కొల్లాగుంట, కార్వేటినగరం మాంగాడు, నగరి ఏకార్లపల్లె (చందం), కుప్పం నెల్లిశెట్టి, తవణంపల్లె
ఎన్జీవో	నేచురల్ లవర్స్ అసోషియేషన్, చిత్తూరు నాగమణి చారిటబుల్ ట్రస్టు, పలమనేరు పలమనేరు పరిరక్షణ సమితి, పలమనేరు

గ్యాంగ్ రేప్ నిందితులకు రిమాండు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం చిత్తూరులో బాలికపై గ్యాంగ్‌రేప్ చేసిన ముగ్గురు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మీడియా సమావేశం పూర్తయ్యాక జిల్లా పోలీసు కార్యాలయం నుంచి అర కిలోమీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు నిందితులను నడిపించుకుంటూ తీసుకెళ్లారు. అంతకుముందు డీపీవో కార్యాలయంలో సీఐలు నిత్యబాబు, మహేశ్వర, శ్రీధర్‌నాయుడితో కలిసి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరాలను తెలియజేశారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగరం మురకంబట్టు సమీపంలో ఉన్న నీవా నగరవనం పార్కులో ఉండిన ఓ ప్రేమ జంటలోని బాలికపై ముగ్గురు అత్యాచారం చేసి, వారి వద్ద నుంచి విలువైన వస్తువులను తీసుకెళ్లిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువకుడు ఇచ్చిన ఫిర్యాదుతో గత నెల 29వ తేదీన తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ మరుసటి రోజు బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలంతో వివిధ సెక్షన్ల కింద అత్యాచారం కేసుగా నమోదు చేశారు. ఎస్పీ తుషార్ ఆదేశాలతో మూడు బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. శుక్రవారం పోలీసులకు అందిన సమాచారం మేరకు చిత్తూరు నగర పరిధిలోని చెన్నమ్మగుడిపల్లె రహదారి వద్ద వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ట్రాక్ వద్ద మురకంబట్టు జీకే నగర్‌కు చెందిన మహేష్(21), మురకంబట్టు అగ్రహారానికి చెందిన కిశోర్(31), మంగసముద్రానికి చెందిన హేమంత్(27)లను పోలీసులు అరెస్టు చేశారు. వాంగ్మూలాన్ని రికార్డు చేశాక వారి వద్ద సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుల్లో ఒకరైన మహేష్. ఈవ్ టీజింగ్ కేసులో ఇదివరకే నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్‌షాపులో పనిచేస్తూ అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియోలు తీసి బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. అత్యాచారం చేయడం.. వీరి ప్రవృత్తిగా పోలీసుల విచారణలో వెల్లడైంది.



నిందితులను రోడ్డుపై నడిపిస్తూ కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

బేడీలు వేసి.. రోడ్డుపై నడిపించి..

ముగ్గురు నిందితులకు పోలీసులు సరికొత్త శిక్ష విధించారు. మీడియా సమావేశమయ్యాక వారిని డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు. రోడ్డు పొడవునా పెద్ద సంఖ్యలో ప్రజలు వారు చేసి అఘాయిత్యం తలచుకుని అసహ్యించుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు నిందితుల్ని పోక్సో కోర్టు జడ్జి శంకరరావు ఈ నెల 16వ తేదీవరకు రిమాండ్ విధించారు.

పార్కుల వద్ద పటిష్ఠ బందోబస్తు : డీఎస్పీ

పార్కుల వద్ద దొంగతనాలు, అత్యాచారాలు జరిగిన నేపథ్యంలో ఇకపై నగరంలోని అన్నిపార్కుల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ సాయినాథ్ చెప్పారు. 'చిత్తూరు మున్సిపాలిటీ, అటవీశాఖల అధికారులతో త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నాం. అన్ని పార్కుల వద్ద సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు చేపడతాం. పిల్లల పట్ల తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కూడా దృష్టి పెట్టాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం' అని వివరించారు.

గోకులం షెడ్ల ప్రారంభం



భూమిపూజలో పాల్గొన్న పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం కంగుంది గ్రామంలో ఈనెల 2వ తేదీన గోకులం షెడ్డు నిర్మాణానికి ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్ భూమిపూజ చేశారు. అలాగే మండలంలోని పొన్నాంగూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్లకు నగదు పంపిణీ

కుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద శనివారం ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కుప్పం చెరువు కట్ట నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఉదయం 9 గంటలకు ఆటో ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఆటో డ్రైవర్లు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సంక్షేమంలో క్రైస్తవులకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

కుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్రైస్తవులకు, పాస్టర్లకు పెద్దపీట వేశారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. కుప్పం క్రిస్టియన్ మైనారిటీ కమ్యూనిటీ భవన్‌లో ఈనెల 2వ తేదీన ఆయన కుప్పం నియోజకవర్గ క్రైస్తవులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రైస్తవల సమాధుల స్థల సేకరణ కోసం సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. క్రిస్టియన్ అని చెప్పుకునే జగన్‌రెడ్డి చేయలేకపోయిన పనిని చంద్రబాబు చేశారన్నారు. క్రైస్తవ సమస్యలపై ఇటీవల చేసిన విన్నపాన్ని ముఖ్యమంత్రి మన్నించి అప్పటికప్పుడు పరిష్కారం కోసం ఉత్తర్వులు ఇవ్వడం, క్రైస్తవ సమాజ ఉద్ధరణపై ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని ప్రశంసించారు. అలాగే బడ్జెట్ సమావేశాల్లో క్రైస్తవుల సంక్షేమానికి ఏకంగా రూ.150 కోట్లు కేటాయించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. విదేశీ విద్య, సబ్సిడీ రుణాలు, జెరూసలేం యాత్రలకు ప్రాధాన్యమివ్వడాన్ని ప్రస్తావించారు. పాస్టర్లకు బకాయి పడ్డ ఏడు నెలల వేతనం మొత్తం ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున అకౌంట్లలో వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పీటర్ నారాయణ, పాస్టర్లు స్టీఫెన్ రాజు, బాలసుబ్రహ్మణ్యం, డీఐ.జాన్, పెనువేల్, జావిర్, గాబ్రియేట్, టీకే.అబ్రహాం, జి.అబ్రహం, ఆరోన్, రాజేశ్, ఎంజీ.అబ్రహాం, బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత ఆర్సీ సుబ్బారెడ్డి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మునిరత్నం తదితరులు

రామకుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఆర్సీ సుబ్బారెడ్డి శుక్రవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యం బారిన పడ్డ ఆయన శుక్రవారం తెల్లవారిజామున స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, కడ సలహా కమిటీ సభ్యుడు రఘు, సీతాపతి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, క్లస్టర్ ఇన్‌చార్జి, కో-ఇన్‌చార్జీలు రవిరెడ్డి, నవీన్ తదితర నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

ఘనంగా గాంధీ జయంతి



మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం టీడీపీ కార్యాలయంలో గురువారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి, నేతలు నరసింహులు, జయశంకర్, జేయి, నవీన్, రామలింగారెడ్డి, సత్తి, భానుమూర్తి, జ్ఞానశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలకృష్ణ, అల్లీశీన తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ



ఆర్ఎంపీని హెచ్చరిస్తున్న జిల్లా వైద్యాధికారి సుధారాణి

పలమనేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను శుక్రవారం జిల్లా వైద్యాధికారి డీటీ సుధారాణి తనిఖీ చేశారు. గంగమ్మగుడి వీధిలోని రామచంద్ర క్లినిక్‌లో మెడికల్ షాపును, రోగులకు వినియోగించిన ఇంజక్షన్లు, సెలైన్‌లను డీటీ సుధారాణి గుర్తించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ రామచంద్రను హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్సలు మాత్రమే చేయాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వచ్ఛత @ కుప్పం మున్సిపాలిటీ!

● స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక

కుప్పం పురపాలక సంఘం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైంది. మున్సిపల్ కమిషనర్ అవిరామ కృషి, సిబ్బంది తోడ్పాటు ఇందుకు కారణమైంది. మరో ఆరు నెలల్లో జీరో వేస్ట్ మున్సిపాలిటీగా తయారు చేయాలన్న లక్ష్యంతో అధికార, పాలక యంత్రాంగం ముందుకు సాగుతోంది. అమరావతిలో ఈనెల 6వ తేదీన జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకోనున్న నేపథ్యంలో ఈ అవార్డు వెనుక ఉన్న కృషిని గురించి తెలుసుకుందాం....



చెత్త రహితంగా కనిపిస్తున్న కుప్పం మున్సిపాలిటీ డంపింగ్ యార్డు

కుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలోని కుప్పం పురపాలక సంఘానికి ప్రత్యేక స్థానముంది. వేల కోట్ల రూపాయలతో ఇక్కడ అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. మోడల్ మున్సిపాలిటీగా తయారు చేసే క్రమంలో ఎన్నో ప్రయోగాత్మక పథకాలు అమలవుతున్నాయి. ఎంత అభివృద్ధి చెందినా చెత్త కుప్పలు, పూడిక తీయని మురుగు కాలువలతో మున్సిపాలిటీ కంపు కొడుతుంటే చేసిన శ్రమ నిష్ఫలమైనట్లే. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు నిరంతరం శ్రమిస్తున్నారు. జూన్ 24, 2024న ఆయన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి రోజుకు 18 గంటలపాటు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ఆయన శ్రమ ఫలితంగా సిబ్బంది సహాయ సహకారాలతో ఇప్పటికే స్వచ్ఛ కుప్పం మార్గంలో ఎన్నో విజయాలు సాధించారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 13 వేల గేట్లలో (ఇళ్లు), 15 వేల కుటుంబాలు నివశిస్తున్నాయి. వీటినుంచి రోజూ 20 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అద్దె ట్రాక్టర్లకు మంగళం పలికిన అధికారులు, మున్సిపాలిటీకి ఉన్న 5 సొంత ట్రాక్టర్లతోపాటు 20 ఎలక్ట్రిక్ ఆటోలను చెత్త తొలగింపునకు వినియోగిస్తున్నారు. ఇవిగాక రూ.80 లక్షల వ్యయంతో ఇటీవల ఒక కాంపాక్ట్ వాహనాన్ని కొనుగోలు చేశారు. 10 టన్నుల సామర్థ్యం గల గ్యాస్‌తో నడిచే ఈ వాహనాన్ని కుప్పం పట్టణంలోని పాత డంపింగ్ యార్డు అయిన శ్మశానం ప్రాంతంలో నిలిపి ఉంచుతున్నారు. ట్రాక్టర్లు, ఆటోలతో సేకరిస్తున్న చెత్తను ఈ వాహనంలో నింపుతారు. పూర్తిగా నిండిన తర్వాత కాంపాక్ట్ వాహనం బయలుదేరి మోడల్ కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తుంది. దీంతో చెత్త సేకరణలో సమయం ఆదా అవుతుంది. తడి చెత్తను, పొడి చెత్తను కుటుంబాల స్థాయిలోనే వేరు చేయాలన్న నినాదం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇలా ఎప్పటికప్పుడు తడిపొడి చెత్తలు క్షేత్ర స్థాయిలోనే వేరు అయి రావడంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ సులభతరమవుతోంది. ఇటీవలే డంపింగ్ యార్డులోని చెత్త మొత్తాన్ని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియతో ఎరువుగా మార్చి విక్రయించారు. అలాగే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించారు. రోజువారీ వస్తున్న చెత్తను వేర్వేరుగా కట్టలు కట్టి ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తున్నారు. ఇలా కట్టిన కట్టల నుంచి మన్నులాంటి తడిచెత్త అక్కడే రాలిపోగా ప్లాస్టిక్ వంటి వ్యర్థాలు మిగిలిపోతున్నాయి. దీన్ని ఎప్పటికప్పుడు ఫ్యాక్టరీలకు తరలించేస్తున్నారు. మిగిలిన ఇతర చెత్తను ఎరువుగా మార్చి విక్రయిస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డు ఎప్పుడు చూసినా పరిశుభ్రంగా కనిపిస్తోంది. అంతేకాదు.. మున్సిపాలిటీ పరిధిలో ఉదయం, రాత్రి రెండు వేళల్లో చెత్త తొలగిస్తున్నారు. మురుగు కాలువలను ప్రొక్లయినర్లు పెట్టి మరీ శుభ్రం చేస్తున్నారు. ఇందువల్ల చెత్త రహితమైన వీధులు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

● చెత్తనుంచి సంపద సృష్టికి పథకం

చెత్తను తొలగించి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడమే కాదు, ఆ తొలగించిన చెత్తనుంచి సంపద సృష్టి కోసం పథకాలను రచిస్తున్నారు. పూల మార్కెట్‌లో ఎక్కువగా ఉత్పత్తి అయ్యే పూల వ్యర్థాలను వీధుల్లో పడేయకుండా దాని నుంచి సుగంధ ధూపం, అగబత్తులు తయారు చేసే ప్లాంటును కేవలం రూ.5 లక్షల వ్యయంతో స్థాపించడానికి ప్రయత్నం జరుగుతోంది. ఈ ప్లాంటు నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. అలాగే రెసిడెన్షియల్ మెడికల్ వేస్ట్‌ను పర్యావరణానికి హాని లేకుండా కాల్చి బూడిదగా మార్చే ప్లాంటును సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయడానికి పథకం రచిస్తున్నారు. కూరగాయల వ్యర్థాల నుంచి ఎరువుల తయారీ ప్లాంటు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. లోటు బడ్జెట్టులో ఉన్న ప్రభుత్వంపై భారం వేయకుండా చెత్తనుంచి సంపద సృష్టించే ఇటువంటి ప్లాంటులను మున్సిపల్ నిధులతోనే నిర్మించడానికి ప్రణాళిక చేస్తున్నారు. దీంతో కంపోస్టు యార్డుకు చేరే చెత్త పరిమాణం తగ్గిపోవడమే కాకుండా మున్సిపాలిటీకి ఆదాయం లభిస్తుంది.

● సీఎం ఆశయానికి అనుగుణంగా



స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనంతో స్థానిక సంస్థలు స్వచ్ఛాంధ్ర రాష్ట్రానికి వెన్నుదన్నుగా నిలవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయంతోనే నేను పనిచేసుకుంటూ వెళ్తున్నాను. మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్ల సహకారంతో నేను, సిబ్బంది రోజుకు 18 గంటలు చేస్తున్న కృషి, స్వచ్ఛాంధ్ర అవార్డుకు కుప్పం మున్సిపాలిటీ ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ముఖ్యంగా మహిళలు స్వచ్ఛ కుప్పం నిర్మాణంలో ఎంతో సహకరిస్తున్నారు. వారికి నా ధన్యవాదాలు. అలాగే ఇళ్ల స్థాయిలోనే తడి పొడి చెత్తను వేరు చేసి అందిస్తే జీరో వేస్ట్ మున్సిపాలిటీగా తయారు చేయడానికి సహకరించిన వారవుతారు. రాబోయే ఆరు నెలల్లో జీరో వేస్ట్ మున్సిపాలిటీని తయారు చేసే లక్ష్యంతో నేను, సిబ్బంది పనిచేస్తున్నాం. ఇందుకు ప్రజలందరూ సహకరిస్తారని నమ్ముతున్నాను.

- వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, కుప్పం

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

రొంపిచెర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పసిబిడ్డలకు మంచి పౌష్టికాహారం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. రాష్ట్రీయ పోషకాహారం దినోత్సవాన్ని పురస్కరించుకొని రొంపిచెర్ల మండలం బండకిందపల్లె అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఆమె గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

రెస్కోలో అధునాతన బిల్లింగ్ అప్లికేషన్



అధునాతన బిల్లింగ్ అప్లికేషన్ ప్రారంభిస్తున్న రెస్కో డైరెక్టర్ తులసీనాథ్ తదితరులు

కుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రెస్కోలో టాడ్ (టైమ్ ఫర్ డే) అనే పేరుతో అధునాతన బిల్లింగ్ అప్లికేషన్‌ను తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం లబ్ధిదారులకు, అలాగే వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు సంబంధించిన బిల్లులను ఇందులో పొందుపరిచారు. మొబైల్ సాంకేతికతతో నడిచే టాడ్ బిల్లింగ్ అప్లికేషన్‌ను రెస్కోలో పాలకమండలి ఈనెల 2వ తేదీన ప్రారంభించింది. ఈ సందర్భంగా రెస్కో డైరెక్టర్ తులసీనాథ్ తదితరులు మాట్లాడుతూ అధునాతన బిల్లింగ్ అప్లికేషన్‌తో కచ్చితమైన విద్యుత్తు బిల్లులు సులువుగా చెల్లించడం సాధ్యమవుతుందన్నారు. అలాగే విద్యుత్తు వినియోగదారులు వారి సమస్యల పరిష్కారం కోసం 1912 నెంబర్‌కు కాల్ సెంటర్‌కు ఫోనులో తెలియజేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రెస్కో పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దోషులను వెంటనే అరెస్టు చేయాలి



పలమనేరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలమనేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని పలమనేరు లో ప్రజా సంఘాలు డిమాండు చేశాయి. శుక్రవారం పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, ఓబుల్‌రాజు, శివాజీ, గోవిందు, సుబ్రహ్మణ్యం, నరసింహులు, నారాయణస్వామి, నారాయణ, శీను పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్ : వెదురుకుప్పం మండలంలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, శ్రీనివాసులు, అంజిప్ప, రాజన్న, రెడ్డెప్ప, వైవీ రమణ, కమ్మిరెడ్డెప్ప, శ్రీరాములు, జేవీ నాగరాజ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



రొంపిచెర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలకు గురై చికిత్సలు పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను రొంపిచెర్లలో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. రొంపిచెర్ల మండలానికి చెందిన దీపకు రూ1,35,634, ప్రవీణ్‌కు రూ18 వేలు, భాను‌కాఎకు రూ.50,250, కొల్లా శకుంతలమ్మకు రూ. 1,94,161, పుంగనూరుకు చెందిన రెడ్డెప్పకు రూ.81,101, నిహంమంత్‌కు రూ.81,801, పులిచెర్లకు చెందిన కుమార్‌రెడ్డికి రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనంజయనాయుడు, రఘునాథ్, గోవర్ధన్‌రెడ్డి, కొండా మురళి, గోపి, ఉయ్యాల రమణ, రామ్మూర్తి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు రైతులకు వరం



సోమల: కందూరులో ట్రాక్టర్ ర్యాలీ



పలమనేరులో అధికారులు, నాయకుల ర్యాలీ



పెద్దపంజాణిలో మానవహారం

సోమల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు రైతులకు వరమని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్‌రాజు అన్నారు. శుక్రవారం కందూరులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, పశువైద్యాధికారి చందనప్రియ, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పి. శ్రీనివాసులు, హరిప్రసాద్, సతీశ్, చాణుక్య, విశ్వనాథం, చంద్రబాబు, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల** : సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌తో సామాన్య ప్రజలకు అన్నిరకాల వస్తువులు, నిత్యావరాలు తక్కువ ధరలకు లభిస్తాయని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండు నుంచి టీడీపీ నాయకులు వ్యాపారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు హరిబాబు, రఘునాథ, సర్పంచి ఇబ్రహీం ఖాన్, నాయకులు అమరనాథడ్డి, మదనమోహన్‌రెడ్డి, గౌస్‌పీర్‌ఖాన్, చెంగల్‌రెడ్డి, ఈశ్వరయ్య, నాగరాజ, కిరణ్‌గౌడ, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రామకుప్పంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పలు వ్యవసాయ యంత్రాల పనితీరును అధికారులు రైతులకు వివరించారు. తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండలాధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనందరెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, నాయకులు బాబు, రామ్మూర్తి, గుర్రప్ప, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, రవిరెడ్డి, నవీన్, పెరుమాళ్, లోకేష్, కృష్ణారెడ్డి, వ్యసాయాధికారి అమృత, సిబ్బంది పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె** : బైరెడ్డిపల్లెలో అధికారులు, నాయకులు కలసి రైతులతో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, ఎంపీడీవో ఆనందబాబు, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఏవో గీతాకుమారి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

● **పెద్దపంజాణి:** పెద్దపంజాణిలో మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీవో బాలాజీ, ఎంఏవో హేమలత, ఎస్ఐ.ధనుంజయరెడ్డి, ఏపీవో మురుగేష్, ఏపీఎం నీరజ, పశువైద్యాధికారి వినీత, నాయకులు మురహరిరెడ్డి, సుధాకరరెడ్డి, సర్పంచి రుద్రమూర్తినాయుడు, నాగరాజరెడ్డి, వేమారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరులో శుక్రవారం రైతులతో కలిసి వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏవో సంధ్య, సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటమునిరెడ్డి, పెద్దబ్బ, జీఎస్టీ ఎగ్జిక్యూటివ్ అధికారి యోగేంద్రనాయుడు, సేల్‌ట్యాక్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో వినోద, సెరికల్చర్ అధికారి ఫిరోజ్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షులు నాగరాజరెడ్డి, గణేష్, జగదీష్‌నాయుడు, గిరి, నాగరాజు, మొగిలీశ్వర పాల్గొన్నారు.



రామకుప్పంలో డ్రోన్ పనితీరును వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



బైరెడ్డిపల్లెలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు



రొంపిచెర్లలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న చల్లా రామచంద్రారెడ్డి , నాయకులు

వాలీబాల్ విజేతగా తమిళనాడు జట్టు



వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన తమిళనాడు జట్టు

కల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో నిర్వహించిన వాలీబాల్ ఫైనల్ పోటీల్లో విజేతగా తమిళనాడు లయన్స్ జట్టు విజయం సాధించింది. రెండు రోజుల పాటు కల్లూరు యూత్ ఆధ్వర్యంలో కొనసాగిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో సుమారు 40 జట్లు పాల్గొనగా ఫైనల్ పోటీలకు పుంగనూరు జట్టు, తమిళనాడు లయన్స్ జట్టు చేరుకున్నాయి. గురువారం సాయంత్రం ఈ రెండు జట్లు వాలీబాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్‌లో తమిళనాడు జట్టు విజయం సాధించింది. విజేతలకు కల్లూరు లయన్స్‌క్లబ్ బహుమతులు అందజేశారు. నిర్వాహకులు అల్తాఫ్, మూసా, ఇస్మాయిల్, యూనస్, టీడీపీ నాయకులు నూర్‌బాషా, బారు, సర్దార్‌బాషా, రత్నం, ఖాసిం, జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మదలి, లయన్ డైరెక్టర్ ఇషాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు బైరెడ్డిపల్లెలో ఉచిత కంటివైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఈనెల 5న ఆదివారం ఉదయం 9 గంటలకు మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటివైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు కంటిపరీక్షలు జరిపి అవసరమైనవారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు.

పిల్లలను తప్పక చదివించాల్సిందే!

● జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారిణి వెంకటేశ్వరి



వలస కుటుంబాలను పరిశీలిస్తున్న జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖఅధికారి వెంకటేశ్వరి

పుంగనూరు రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన పిల్లలను తప్పక పాఠశాలల్లో చేర్పించి చదివించాల్సిదేనని జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వరి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సింగిరిగుంట సమీపంలోని డంపింగ్‌యార్డును ఆమె సందర్శించారు. డంపింగ్‌యార్డులో నివాసం ఉన్న సుబ్రహ్మణ్యం, జయమ్మ దంపతుల కుమార్తె జయశ్రీ(4) చెత్తలో దొరికిన కూల్‌డ్రింక్ బాటిల్‌లో ఉన్న పానీయాలను తాగి మృతి చెందడంతో ఆ పరిసరాలను తనిఖీ చేశారు. సుబ్రహ్మణ్యం కుటుంబం అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు. యార్డులో నివాసం ఉన్న చరణ్, మల్లీశ్వరి కుటుంబంతో మాట్లాడి నలుగురు ఆడపిల్లలను మదనపల్లె బాలసదన్‌లో, ఓ బాలుడిని సంజయ్ చిల్డ్రన్‌హోమ్‌లో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపురంలో పారిశుధ్య పనుల తనిఖీ

పెద్దపంజాణి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): లింగాపురం పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో బాలాజీ శుక్రవారం తనిఖీ చేశారు. పారిశుధ్య పనులపై ఆరా తీశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.



వైసీపీ నేతల నిరసన

రాజకీయ దుమారం

అంబేడ్కర్ విగ్రహానికి అర్ధరాత్రి దాటాక నిప్పు ● రోజంతా ఆందోళనలతో హోరెత్తిన దేవళంపేట

వెదురుకుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):వెదురుకుప్పం మండలంలోని దేవళంపేట శుక్రవారం పగలంతా రాజకీయ ఆరోపణలతో, ఆందోళనలతో హోరెత్తింది.వేకువజామున వెలుగుచూసిన అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటన రాజకీయ రంగు పులుముకుంది.పాక్షికంగా కాలిపోయిన విగ్రహాన్ని చూసిన వారు సమాచారమందించడంతో టీడీపీ,జనసేన, వైసీపీ,బీజేపీ, బీఎస్పీ,సీపీఐ నేతలు,శ్రేణులతో పాటు దళిత సంఘాల ప్రతినిధులు దేవళంపేట చేరుకున్నారు.వైసీపీ నేతలు నారాయణస్వామి, కృపాలక్ష్మి, బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య,దళిత సంఘాల ప్రతినిధులు మొదట అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వెదురుకుప్పం-కొత్తపల్లె మిట్ట రోడ్డుపై బైఠాయించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి.ఈ ఘటనకు కారకులైన టీడీపీ నాయకుడు సతీష్ నాయుడు తదితరులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.అయితే రాజకీయలబ్ధి కోసం వైసీపీ నాయకులే నిప్పు పెట్టి ఆ నిందను తెలుగుదేశంపై మోపుతున్నారని తెలుగుదేశం నేతలు ఆందోళనకు దిగారు. దేవళంపేటలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈలోపు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడీ, ఎమ్మెల్యేలు వీఎం థామస్, మురళీమోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ తదితరులు దేవళంపేటకు చేరుకుని పరిస్థితులను సమీక్షించారు.వైసీపీ పాలనలో ఆ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినప్పుడు రాజకీయ గొడవలు జరగడం, స్థానికంగా పాత కక్షలున్న నేపథ్యంలో వైసీపీ శ్రేణులే నిప్పు పెట్టారని ఎమ్మెల్యే థామస్ ఆరోపించారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ గెలవడం, ఎన్నడూ లేనంతగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జీర్ణించుకోలేని మాజీ మంత్రి నారాయణస్వామి ఇలాంటి దురాగతాలు చేయిస్తున్నాడని ఆరోపించారు.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న పాకకు సర్పంచ్ గోవిందయ్య నిప్పు పెట్టడం వల్ల కాలిపోయిందని తమ వద్ద సమాచారం ఉందన్నారు.ఎస్సీలు, ఇతర సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికే నారాయణస్వామి ఈ పన్నాగం పన్నారని ఆరోపించారు. దోషులను వదిలిపెట్టే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ఎస్సీలను వాడుకుంటూ నీచ రాజకీయాలు చేసే సంస్కృతి నారాయణస్వామిదేనని మండిపడ్డారు.అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిస్తే మరో వర్గం ఆగ్రహించి పక్కనే ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నిప్పు పెడతారని దాంతో రాజకీయ సెగలు రేపవచ్చన్న రాజకీయ కుట్ర ఇందులో దాగి వుందన్నారు.లేకుంటే గురువారం అర్ధరాత్రి దాటాక ఘటన జరిగితే లైవ్ ఎలా తీస్తారని ప్రశ్నించారు.సర్పంచ్ గోవిందయ్యతో పాటు నారాయణస్వామి తదితరులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



అంబేడ్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ

సీఎం సీరియస్

దేవళంపేట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించారు. హోం, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులను అప్రమత్తం చేస్తూ లోతుగా విచారణ జరిపించి అసలు దోషులు ఎవరో గుర్తించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దీంతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ డూడే తదితరులు దేవళంపేటకు చేరుకుని పరిస్థితులను సమీక్షించారు.అన్ని కోణాల్లో విచారణ మొదలు పెట్టారు.డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, సుమన్, పోలీసులు బలగాలు దేవళంపేటకు చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. బొమ్మయ్యపల్లె గ్రామ కార్యదర్శి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.పాక్షికంగా కాలిపోయిన విగ్రహాన్ని తొలగించి, కొత్త విగ్రహాన్ని పెట్టే పనుల్లో ఎమ్మెల్యే థామస్ బృందం నిమగ్నమైంది.పాక్షికంగా కాలిపోయిన అంబేడ్కర్ విగ్రహ స్థానంలో శుక్రవారం రాత్రి కాంస్య విగ్రహాన్ని తెప్పించి పెట్టించారు.ఎమ్మెల్యేలు వీఎం థామస్, మురళీమోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్,కలెక్టర్ సుమిత్‌కుమార్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ పొన్న,టీడీపీ నేతలు పి.మోహన్‌మురళి, సాతల గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ నమస్కారం

దేవళంపేటకు ఎస్పీ తూషార్ డూడీ చేరుకున్న సమయంలో వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్నారు.ఎస్పీ రాగానే బూట్లు విప్పి అంబేడ్కర్ విగ్రహానికి నమస్కారం చేశారు.ఆ తరువాతే పరిస్థితిని సమీక్షించే పనిలో పడ్డారు.

'ముక్కంటి' పాలకమండలికి రాష్ట్రస్థాయి ప్రాధాన్యం

● వివిధ నియోజకవర్గాల నుంచి 16 మంది సభ్యుల నియామకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలికి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం కల్పించింది. ఇప్పటి వరకు ఛైర్మన్‌తో పాటు సభ్యులకూ స్థానికులకు మాత్రమే అవకాశం కల్పించేవారు. ఈసారి ఆలయానికి రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం కల్పించి అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో టీటీడీ తరహాలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ 16మంది సభ్యులు, ఒక ప్రత్యేక ఆహ్వానితుడితో కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యుల వివరాలు ఉన్నాయి.

పేరు	అసెంబ్లీ నియోజకవర్గం	పార్టీ
కొట్టే సాయి ప్రసాద్(ఛైర్మన్)	శ్రీకాళహస్తి	జనసేన
సభ్యులు		
బీలా స్రవంతి	యలమంచిలి	టీడీపీ
చిన్నపోల లక్ష్మీనారాయణ	పుట్టపర్తి	టీడీపీ
డి.లక్ష్మమ్మ	శ్రీకాళహస్తి	టీడీపీ
జి.గోపీనాథ్	శ్రీకాళహస్తి	టీడీపీ
కె.కుసుమ కుమారి	ఒంగోలు	టీడీపీ
కొమ్మనబోయిన రజని	చీరాల	టీడీపీ
నాగరాజు కొప్పెర్ల	చింతలపూడి(ఎస్సీ)	టీడీపీ
పెనగలూరు హేమావతి	కడప	టీడీపీ
కొమ్మిరి విజయమ్మ	నెల్లూరు సిటీ	టీడీపీ
రుద్రాక్షుల కౌసల్యమ్మ	వెంకటగిరి	టీడీపీ
దండి రాఘవయ్య	శ్రీకాళహస్తి	జనసేన
పగడాల మురళి	తిరుపతి	జనసేన
వి. గుర్రప్పశెట్టి	శ్రీకాళహస్తి	టీడీపీ
కోలా వైశాలి	శ్రీకాళహస్తి	బీజేపీ
ప్రకాశ్‌రెడ్డి	తెలంగాణ	తెలంగాణ
కల్లె సావిత్రి	రాజంపేట	టీడీపీ
ప్రత్యేక ఆహ్వానితులు		
చగణం శైలజ	శ్రీకాళహస్తి	

ఖైదీల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత: కలెక్టర్



ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖైదీల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జైలు నుంచి విడుదలైన తర్వాత మంచి పౌరులుగా మెలగాలని సూచించారు. అనంతరం జైలు ఆవరణలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎంఎన్ పద్మజ, జైలు సూపరింటెండెంట్ వెంకటరెడ్డి, జైలర్ కుమారస్వామి, అంజినాయక్, డిఫ్యూటీ జైలర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

15న బంగారుపాళ్యంలో 'మామిడి' గర్జన సభ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యాన్ని అరికట్టి, సత్వరం బిల్లులు చెల్లించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన బంగారుపాళ్యంలో అఖిల పక్షపార్టీల తోడ్పాటుతో మామిడి రైతుల గర్జన సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు మామిడి రైతుల సంక్షేమ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీ తీర్మానించింది. శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50వేల మంది రైతులు మామిడిని గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల ద్వారా విక్రయాలు చేశారన్నారు. కంపెనీలు, ర్యాంపుల ద్వారా కిలోకు రూ.8, ప్రభుత్వ సబ్సిడీ రూ.4 మొత్తంగా రూ.12 చొప్పున రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు ఎలాంటి చెల్లింపులు లేక కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. దీనికి నిరసనగా గర్జన సభ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంత చేయాలని కోరారు. సంఘం నాయకులు మునీశ్వర్‌రెడ్డి, సురేంద్ర, త్యాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పండుగ వాతావరణంలో 'ఆటో డ్రైవర్ సేవలో': కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఆటో మిత్ర ద్వారా ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 6777 మంది ఆటో డ్రైవర్లకు రూ.10.16 కోట్ల లబ్ధి చేకూరనున్నట్లు వివరించారు. నియోజకవర్గస్థాయిలో నిర్వహించే కార్యక్రమాలకు ఆటోడ్రైవర్లు, వారి కుటుంబీకులు సభకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. నియోజకవర్గాల వారీగా.. చిత్తూరులో 1402 మందికి రూ.2.10 కోట్లు, పూతలపట్టులో 1074 మందికి రూ.1.61 కోట్లు, జీడీనెల్లూరులో 936 మందికి రూ.1.40 కోట్లు, నగరిలో 293 మందికి రూ.43.95 లక్షలు, పలమనేరులో 1028 మందికి రూ.1.54 కోట్లు, కుప్పంలో 574 మందికి రూ.86.10 లక్షలు, పుంగనూరులో 1470 మందికి రూ.2.20 కోట్ల లబ్ధి చేకూరనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఘనంగా ఆయుధ పూజ



పూజలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడి దంపతులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయ దశమిని పురష్కరించుకుని గురువారం జిల్లా పరేడ్ మైదానంలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఆయుధ కర్మాగారం, పోలీసు క్యాంటీన్, జిమ్, అడ్మిన్ కార్యాలయం, పోలీసు అసోసియేషన్ కార్యాలయాల్లో జరిగిన ఆయుధ పూజలో ఎస్పీ తుషార్ డూడి దంపతులు పాల్గొన్నారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్



గోడను కూల్చి నిలుచున్న ఏనుగు

పలమనేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని కుంకీ ఏనుగుల క్యాంపు వద్ద ఒంటరి ఏనుగు గురువారం తెల్లవారుజామున హల్‌చల్ చేసింది. కుంకీ ఏనుగుల వాసనను పసిగట్టి సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు క్యాంపు లోపలికి ప్రవేశించేందుకు విఫలయత్నం చేసింది. అయితే ముసలిమడుగు గ్రామ సమీపంలోని కుంకీ ఏనుగుల క్యాంపు చుట్టూ కందకాలు తవ్వడంతో పాటు హ్యాంగింగ్ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటుచేసి ఉండటంతో ఒంటరి ఏనుగు లోపలికి ప్రవేశించలేక పోయింది. అక్కడే ప్రధాన ద్వారం వద్ద నిర్మించిన గోడను కూల్చి అక్కడే వేచి ఉండి ఇక లోపలికి వెళ్లలేమని భావించిన ఒంటరి ఏనుగు ముసలిమడుగు సమీపంలోని పంటపొలాల మీదుగా మళ్లీ అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ సంఘటన కుంకీ ఏనుగుల క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయింది.

కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న డీఈవో వరలక్ష్మి, ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి చిత్తూరు, తిరుపతి కేంద్రాల్లో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 10వ తేదీ వరకు తరగతులు నిర్వహించనున్నారు. 1407 మందికి 1,398 మంది హాజరువగా, తొమ్మిది మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. చిత్తూరులోని ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్లో 120 మందికి 118 మంది, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 152 మందికి 150 మంది హాజరయ్యారు. తిరుపతి కేంద్రంగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 213 మందికి 211 మంది, విశ్వం స్కూల్లో 250 మందికి 249 మంది, మెడ్‌జీ స్కూల్లో 450 మందికి 449 మంది, ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజ్‌లో 222 మందికి 221 మంది హాజరయ్యారు. చిత్తూరులో డీఈవో వరలక్ష్మి, తిరుపతిలో డీఈవో కేవీఎన్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో సమగ్రశిక్ష ఏపీసీల సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గైర్హాజరైన వారికి త్వరలో విజయవాడలో శిక్షణ తరగతులు ఉంటాయి.

డీఈవో పూల్లోని పండిట్‌లకు ఎస్ఏలుగా పదోన్నతి

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డీఈవో పూల్లోని 166 మంది పండిట్‌లకు ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రాష్ట్ర విద్యశాఖ నుంచి గురువారం మధ్యాహ్నం రాగా, అప్రమత్తమైన విద్యాశాఖ అధికారులు రాత్రి 12.30 నుంచి 2.30 గంటలకు వరకు పండిట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఎస్ఏలుగా పదోన్నతి, పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. కాగా అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 35 మందికి శనివారం ఉదయం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వడమే ధ్యేయం

'కృష్ణదేవరాయ' సంఘ వార్షికోత్సవంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి



సంఘ ప్రతినిధులకు రూ.50లక్షల చెక్ అందజేస్తున్న గల్లా అరుణకుమారి

పూతలపట్టు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పేటమిట్టలోని మంగళ విద్యాలయం ఆవరణంలో శ్రీకృష్ణదేవరాయ విద్యా, సాంస్కృతిక సంఘ 50వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు ఎంతోమంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి చేయూత ఇవ్వాలన్న ధ్యేయంతోనే తన తండ్రి పాటూరు రాజగోపాల్ నాయుడు స్ఫూర్తితో అమరరాజా సంస్థల అధినేత రామచంద్ర నాయుడు.. ఈ సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో ఎంతోమంది దాతలను భాగస్వాములుగా చేసి టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, సీఏ తదితర కోర్సుల్లో ప్రతిభ చూపిన 250 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలను అందించడం జరిగిందన్నారు. తాను రాసిన 'స్వీయచరిత్ర' పుస్తకం మొదటి ముద్రణలోనే 10వేల కాపీలు అమ్ముడుపోయాయని, ఆ పుస్తకాల ద్వారా గత ఏడాది వచ్చిన రూ.50లక్షలతోపాటు మరో రూ.50లక్షలను కలిపి రూ.కోటిని పేద విద్యార్థుల చదువుకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో సంఘానికి విరాళంగా ఇవ్వడానికి చాలా సంతోషపడుతున్నానని అన్నారు. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా 1968లో రూ.వెయ్యి పెట్టుబడితో ఈ సంఘాన్ని స్థాపించగా, నేడు రూ.10 కోట్లు దాటిందన్నారు. సాయం పొందిన విద్యార్థులు భవిష్యత్తులో స్థిరపడి మరికొంత మందికి సాయం చేయాలని సూచించారు. శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘ అధ్యక్షురాలు డాక్టర్ గౌరినేని రమాదేవి మాట్లాడుతూ.. ట్రస్టు ద్వారా లబ్ధిపొందిన విద్యార్థులందరూ చక్కగా చదువుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ.. వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి ఆదుకుంటున్న గల్లా కుటుంబాన్ని ప్రశంసించారు. పెనుమూడు డైరెక్టర్ ఆఫ్ ఎడిఫై విద్యాసంస్థల అధినేత ప్రణీత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఎంతైనా అవసరమని అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. సంస్థ కార్యదర్శి మహదేవనాయుడు, సభ్యులు రాళ్ళపల్లి సతీష్, బాలాజీ కిరణ్, ప్రణీత్, సుధీర్, డాక్టర్ ప్రసాద్, ఉమాకాంత్, స్థానిక సర్పంచ్ గల్లా రాధాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, దాతలు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఉద్యోగుల చేతివాటం

● నలుగురు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు



ప్రభుత్వాస్పత్రిలో దొంగతనంగా ఆటోలో వస్తువులు ఎక్కిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

పలమనేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వినియోగంలో లేని వస్తువులను దొంగతనంగా ఆటోల్లో తీసుకెళ్లి గుజరీ దుకాణంలో విక్రయిస్తున్న నలుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని గుర్తించి అధికారులు వారిని ఉద్యోగం నుంచి తొలగించారు. గత కొద్దిరోజులుగా ఈ తంతు జరుగుతున్నప్పటికీ నాలుగురోజుల క్రితం ఈ సంఘటన రెడ్ హ్యాండెడ్‌గా కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లోను, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పంపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి మాట్లాడుతూ విషయం గత నెల 29వ తేదీన తన దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని.. పోలీసులు విచారణ చేస్తున్నారని తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది, శానిటరీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది చోరీకి పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని.. గతంలోనూ ఆస్పత్రిలో పాలుమార్లు వస్తువులు తరలించి విక్రయించినట్లు ఒప్పుకున్నారన్నారు. దీంతో వారిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు తెలిపారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా మొక్కలు

కల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాతపేట, చల్లావారిపల్లి, మతుకువారిపల్లి పంచాయతీల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు పంటపొలాల్లో తిష్ఠ వేసిన ఏనుగులు నానా బీభత్సం సృష్టించాయి. దీంతో వరి, టమోటా, మామిడి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ముందుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన 10 ఏనుగుల గుంపు కల్లూరు-గంటావారిపల్లి రోడ్డును దాటుకొని పాతపాళ్యం అటవీ మార్గంలో పాతపేట వద్దకు చేరుకున్నాయి. పాతపేట, చల్లావారిపల్లి, మతుకువారిపల్లి గ్రామాలకు చెందిన వరి, టమోటా, మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఏనుగులు అడవిలో ఉన్నట్లు ప్రజలు తెలిపారు.

నింద్ర ఎంపీపీగా దుర్గాదేవి



నింద్ర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నింద్ర ఎంపీపీగా అత్తూరి ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ-1గా ఉన్న దుర్గాదేవిని ప్రకటిస్తూ శుక్రవారం జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఎంపీడీవో శివప్రసాద్ వర్మ తెలిపారు. గతంలో ఎంపీపీగా ఉన్న దీప వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టనున్నట్లు దుర్గాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం : జేసీ



రైతుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని జేసీ విద్యాధరి అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ నుంచి రైతులు నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. బయో పురుగు మందులపై 5శాతం తగ్గించగా, పాడి, ఆక్వాకల్చర్‌పై పూర్తి మినహాయింపు ఇచ్చిందన్నారు. వెన్న, నెయ్యి ఉత్పత్తులపై కేవలం 5 శాతం జీఎస్టీని పరిమితం చేసిందన్నారు. ట్రాక్టర్లపై రూ.42 వేల వరకు ఆదా కాగా, నీటి పారుదల, సౌరపరికరాలు, డ్రిప్, స్రింక్లర్లపై 5 శాతానికి పన్ను పరిమితం చేసిందన్నారు. కొత్త కలెక్టరేట్ నుంచి సాగిన ఈ ర్యాలీ గిరింపేటలోని పాత కలెక్టరేట్ వరకు సాగింది. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యతలో లోపాలపై ఫిర్యాదు చేయండి: జేసీ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తాగునీటి నాణ్యతలో లోపాలంటే టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి సూచించారు. శుక్రవారం తన చాంబర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్రమాణాలపై సమీక్షించారు. సంబంధిత అధికారులు మినరల్ వాటర్ ప్లాంట్లపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, రిపోర్టులను అందజేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో లభించే ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మినరల్ వాటర్ బాటిల్, కేన్స్‌పై తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లోగో, లైసెన్స్ నెంబరు ఉందోలేదో? పరిశీలించాలన్నారు. అనుమానాలుంటే 086482410295 టోల్ ఫ్రీ నెంబరు, 94403 79755 సెల్ ఫోన్ నెంబరుకు చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారి నాగేంద్ర బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కాణిపాకంలో భక్తిశ్రద్ధలతో శమీపూజ




మణికంఠేశ్వరాలయంలో శమీ పూజను నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్ - మహిషాసురమర్ధినిగా మరగదాంబిక

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని మణికంఠేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా గురువారం రాత్రి శమీపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు మహిషారుసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం చేశారు. సాయంత్రం భక్తుల ఆధ్వర్యంలో కుంకుమార్చనను నిర్వహించారు. రాత్రి ఆలయ చైర్మన్ మణినాయుడు, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మణికంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో ఉన్న జమ్మిచెట్టుకు శమి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అగరంపల్లెకు చెందిన మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి మరగదాంబికాదేవి ఉత్సవ విగ్రహాన్ని కాణిపాకం పురవీధులలో వైభవంగా ఊరేగించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం భూమిపూజ చేశారు. డీసీవో లక్ష్మి, సీఈవో తులసిపిళ్లై సహకారంతో గదుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చైర్మన్ బాలాజి శ్రీకారం చుట్టారు. నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో వాణి, బీఎం విజయభాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు జవహర్‌రెడ్డి, ఐవీ నాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్, తహసీల్దార్ రవి కుమార్, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు సురేష్‌నాయుడు, కుమార్‌నాయుడు, దేశమ్మగుడి కృష్ణారెడ్డి, దూర్వాసులనాయుడు, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, మీట్ కార్పొరేషన్ డైరెక్టర్ మీర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ టెక్నాలజీ రూరల్ వాటర్ స్కీమ్ పరిశీలన



కుశస్థలి నది వద్ద ఎస్‌ఈ ప్రసన్నకుమార్

విజయపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలం ఇళ్లత్తూరులోని రాజీవ్ టెక్నాలజీ రూరల్ వాటర్ స్కీమ్‌ను శుక్రవారం చిత్తూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్, ఈఈ విజయకుమార్, డీఈ శ్రీహరి పరిశీలించారు. నాణ్యమైన తాగునీరు అందించడానికి కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏఈ గిరీష్‌కుమార్, కాంట్రాక్టరు ఏకుమళై తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువ లేనిది



గుడిపాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారం మరువ లేనిదని నరహరిపేట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం దుర్వాసులు అన్నారు. శుక్రవారం పాఠశాలకు స్టీల్ నేమ్ బోర్డును కృష్ణమనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చంద్రశేఖర్‌నాయుడు సమకూర్చారు. విద్యార్థులకు ఐదు వందల స్టీల్ ప్లేట్లను వితరణ చేసి, అన్నదానం చేశారు. క్రీడల కోసం సాంబశివనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె తుమ్మల లలిత.. రూ.1.50 లక్షలను అందజేస్తామని ప్రకటించారు. సీఎస్ఆర్ కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్, విశ్రాంత ఎంఈవో చినతంబి, ఉపాధ్యాయులు అర్జున్, గోపి పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటులో చంద్రబాబు, లోకేశ్ పాత్ర కీలకం

- ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటులో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పాత్ర కీలకమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. చిత్తూరు, కుప్పంలో కేంద్రీయ విద్యాలయాలు మంజూరుచేసిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపారన్నారు.

వేపంజేరిలో వైభవంగా చక్రస్నానం



గంగాధరనెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. అంతకుముందు శ్రీదేవి, భూదేవి సమేత నారాయణుడి ఉత్సవర్లతో పాటు చక్రతాళ్వార్‌ను కోనేటివరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ పూజలు చేశాక.. కోనేటిలో చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. ఆలయ ట్రస్టీ కె.ఎస్. వాసు, అమృతవల్లి దంపతులు, మాజీ ట్రస్టీ సతీమణి సుమిత్రాశ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో రైతాంగానికి చేయూత



అధికారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్లను తగ్గించడంతో రైతాంగానికి చేయూత లభిస్తుందని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, కమర్షియల్ ట్యాక్స్ అధికారి సుమతి తెలిపారు. గంగాధరనెల్లూరులో శుక్రవారం పలువురు రైతులు ట్రాక్టర్లను తీసుకొచ్చి అధికారులు, టీడీపీనేతలతో కలిసి సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీడీపీనేతలు శ్రీధర్‌యాదవ్, మోహన్‌నాయుడు, బాబునాయుడు, స్వామిదాస్, దేవసుందరం, హరీష్‌యాదవ్, లోకమ్మ, శివప్రసాద్, జ్యోతియాదవ్, జీవరత్నం, ఆర్ముగం, జమీర్, భువనేశ్వరి, ఏవో భవాని, సింగిల్‌విండో సొసైటీ సీఈవో విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడిపాల: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏవో సంగీత, ఇన్‌చార్జి ఎంపీడీవో కుమార్, తెలుగు రైతు మండల ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, సర్పంచ్ గుర్రప్పనాయుడు, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మహేష్‌నాయుడు, జీఎస్టీ అధికారి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసంలో 'విజయదశమి' పూజలు



చిత్తూరు సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో వియదశమి సందర్భంగా గురువారం పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాహనాలకు పూజలు చేసి, నగరంలో ర్యాలీ నిర్వహించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

చిత్తూరు సిటీ, అక్టోబరు 3 (ఆద్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. చిత్తూరుకు పాలిటెక్నిక్ కూడా అవసరమని చెప్పగా, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు శరత్, ఉపాధ్యక్షుడు హేమంత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరు: పుష్ప పల్లకిలో అల్లియెల్లమ్మ



విజయపురం: రాజరాజేశ్వరి దేవిగా కనకదుర్గమ్మ




వెదురుకుప్పం: డీఆర్ఎన్‌కండ్రిగలో రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు - దేరాకండ్రిగలో రాజరాజేశ్వరి దేవిగా నైనేరమ్మ



చిత్తూరు: వీరాంజనేయ స్వామి ఆలయంలో విష్ణుమూర్తి అలంకారం

ముగిసిన దసరా ఉత్సవాలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. నగరంలోని గిరింపేట దుర్గాంబ ఆలయంలో వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాలక మండలి చైర్మన్ దిలీప్ రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కట్టమంచి సాయి కృపా అపార్ట్‌మెంట్‌లోని సాయిబాబా ఆలయంలో మంగళ నారాయణి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పొన్నియమ్మ గుడి వీధిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో విష్ణుమూర్తి అలంకారం, రాముల వారి గుడివీధిలోని కోదండరామస్వామి ఆలయంలో కృష్ణావతారంలో స్వామివార్లు భక్తులను కటాక్షించారు.

గంగాధరనెల్లూరు: గ్రామంలోని అల్లియెల్లమ్మకు పుష్పపల్లకి సేవను గురువారం రాత్రి నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జాము వరకు ఊరేగింపు జరగ్గా.. అమ్మవారికి మహిళలు కర్పూరహారతులు పట్టారు.

విజయపురం: మిట్టూరులో కనకదుర్గమ్మ.. రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు మహేష్‌శర్మ, రాంప్రసాద్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం డీఆర్ఎన్‌కండ్రిగలోని అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగానే దర్శనమిచ్చారు. కార్వేటినగరం మండలం దేరాకండ్రిగలో నైనేరమ్మ కూడా రాజరాజేశ్వరిగా భక్తులను కటాక్షించారు. అన్నా మార్కొండయ్య, శాంతి దంపతులు, ఆముదాల మురళి, సుగుణ దంపతులు, కె.బొబ్బిరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. ఆలయ ధర్మకర్త బుర్రా ఆనంద్, డి.ప్రకాష్, కె.భాస్కర్, కె.వాసు పాల్గొన్నారు.

నగరి: గ్రామదేవత సామాలమ్మ గుడిలో చివరి రోజున ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలకు చీర, సారెలను ఒకటో వార్డుమాజీ కౌన్సిలర్ చలపతి సౌజన్యంతో అందించారు. నగరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. డాక్టర్ భక్తవత్సలం, మనోహర్ నాయుడు, టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, రమేష్, గోపి, కుప్పయ్య శెట్టి పాల్గొన్నారు.



సామాలమ్మగుడిలో పూజలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



గోకులం షెడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

తవణంపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. గురువారం పల్లె పండుగలో భాగంగా మండలంలోని కొత్తగొల్లపల్లెలో రైతు సిద్ధయ్య పొలం వద్ద నిర్మించనున్న గోకులం షెడ్డుకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం తవణంపల్లెలో గల మహిళా మార్టు వద్ద జీఎస్టీపై అవగాహన సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా వినియోగదారులకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, నాయకులు గాలి దిలీప్, ప్రవీణ్ నాయుడు, గోపి, శరవణ, శంకర్ యాదవ్, ఎంపీడీవో రెడ్డిబాబు, ఏపీవో బాల, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలంటూ టీడీపీ నిరసన



వెదురుకుప్పం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలంటూ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, పీఏసీఎస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, వన్నియకుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, కాలుష్య నియంత్ర మండలి సభ్యులు నగలపాటి నాగేశ్వరరాజు, గ్యాస్ రవికుమార్‌నాయుడు, టీడీపీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, చెంగల్రాయయాదవ్, రుద్రయ్యనాయుడు, ఏఎంసీ చైర్మన్ కృష్ణమనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్లు అరుళ్‌నాధన్, రావిళ్ల దేవరాజులునాయుడు, నాయకులు సాతల గుణశేఖర్, తిరుమలనాథన్, పైడి మనోహర్‌నాయుడు, కుప్పయ్య, రజనీకాంత్, వరప్రసాద్, బీఎం రవి పాల్గొన్నారు.

కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

చిత్తూరు రూరల్/చిత్తూరు సిటీ/పూతలపట్టు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండు చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించకూడదన్నారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారదర్శకంగా విచారణ జరిపించాలని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు మంచిది కాదన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సంగీతం అనిల్‌కుమార్ మాదిగ హెచ్చరిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

రోడ్డును తవ్వేస్తారట?

- సీఎస్ అగ్రహారం గ్రామస్తుల ఆవేదన

పెనుమూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తాతల కాలం నుంచి ఉన్న రోడ్డును తవ్వేస్తామని చార్వాగానిపల్లెకు చెందిన ఇద్దరు చెబుతున్నారని సీఎస్ అగ్రహారం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ఐకి మనోజ్‌కి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామంలో 50 ఇండ్లు ఉన్నాయన్నారు. అందరూ కూలీనాలీ చేసుకునే బీసీలమన్నారు. దారిని అడ్డుకుంటున్న వారు భూమి కొనుగోలు చేసినప్పుడు కూడా దారి ఉంది. ఈ దారికి బదులు తమ గ్రామంలోని ఎల్‌పీఎం 424 నంబరులో 28 సెంట్లను పూర్వీకులు వారికి ఇచ్చారు. ఆ భూమికి డీకేటీ పట్టా కూడా వారి కుటుంబీకుల పేరుతో తెచ్చుకుని దారిని రాసివ్వలేదని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామానికి 108రాదు, పాలవ్యాను రాదు.. ఇటీవల ఓ గుండెజబ్బు రోగిని కూడా ద్విచక్ర వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చిందని వాపోయారు. ఇకనైనా కలెక్టర్, తహసీల్దారు విచారించి, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామస్తులు మునిక్రిష్ణారెడ్డి, శ్రీధర్, మాధవన్, సురేష్, సాయి, హరికృష్ణ, తులసిరాం, రోసిరెడ్డి, పరశురాం, శరత్‌చంద్ర, వినయ్, నారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



శ్రీరంగరాజపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 49.కొత్తపల్లెమిట్టకుచెందిన వెంకటేష్ తనకోళ్లఫారంలో రెండుటన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గురువారం ఉదయం విజిలెన్స్‌కు సమాచారం అందింది. విజిలెన్స్ సీఐ రవి తన సిబ్బందితో వెళ్లి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

కొలువుదీరిన ముత్యాలమ్మ ఆలయ పాలకమండలి



చిత్తూరు సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తేనెబండ ముత్యాలమ్మ దేవాలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా వై.యుగంధర్ బాబుతోపాటు ఎనిమిది సభ్యులతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ముగిసిన కుంభాభిషేక పూజలు



ఊరేగుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

నింద్ర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కచ్చరవేడులో జరుగుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి నూతన ఆలయ మహా కుంభాభిషేక పూజలు శుక్రవారంతో ముగిశాయి. గురువారం కలశం విమాన గోపుర మహా సంప్రోక్షణం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి ఉత్సవర్ల ఊరేగింపు నిర్వహించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ కార్య నిర్వాహకులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ రథయాత్ర

విజయపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహారాజపురంలో గురువారం సత్యసాయి ప్రేమ రథయాత్ర నిర్వహించారు. చెన్నై సుందరం గుడి నుంచి పళ్లిపట్టు వరకు చేపట్టిన యాత్రలో భాగంగా మహారాజపురంలో వీధుల్లో రథయాత్ర జరిగింది. తిరువళ్లూరు జిల్లా సత్యసాయిసర్వీస్ కో-ఆర్డినేటర్ కేవీ వెంకటరాజు, గ్రామస్తులు బాలసుబ్రహ్మణ్యంరాజు, సత్య, పార్వతమ్మ పాల్గొన్నారు.

స్వచ్ఛతే గాంధీ మార్గం: కమిషనర్



పారిశుధ్య సిబ్బందితో కలిసి రోడ్డును శుభ్రం చేస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతే గాంధీ మార్గమని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా రోడ్లను పారిశుధ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పురపాలక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: పి.కొత్తకోట గ్రామ సచివాలయంలో టీడీపీ నేత బాబురావు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్ పద్మజారాణి, పంచాయతీ కార్యదర్శి జరీనా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లను నియంత్రించాలి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సెలూన్లను నియంత్రించాలని జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు కోరారు. శుక్రవారం కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సెలూన్లతో కులవృత్తిని నమ్ముకున్న తమకు పూటగడవటం కష్టంగా మారుతోందని తెలిపారు.

రీసర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆత్మకూరు పంచాయతీలో సర్పంచ్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన మూడో విడత రీసర్వేపై రైతులకు అవగాహన సమావేశం జరిగింది. ఉద్యోగులు పాల్గొన్నారు.

మూడిళ్లలో చోరీలు

- నగలు, నగదు అపహరించుకెళ్లిన దుండగులు

నగరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని రెండు గ్రామాల్లోని మూడిళ్లలో చోరీలు జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముడిపల్లె గ్రామానికి చెందిన నాగరాజస్వామి బుధవారం బొమ్మల కొలువు నిర్వహించారు. దాంతో ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో రాత్రి బస చేశారు. గురువారం ఉదయం ఇంటికి వెళ్లేసరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉంచిన రూ.30వేలతోపాటు బొమ్మల కొలువులో అమ్మవారికి వేసిన రెండు సవరాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పక్కింట్లోని నాగరాజు తన ఉద్యోగరీత్యా నగరి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. చోరీ విషయం తెలుసుకున్న ఆయన తన ఇంటికి రాగా, ఆయన ఇంట్లోనూ చోరీ జరిగిందని తేలింది. పూజ గదిలోని సవరం బంగారు నగలు చోరీకి గురయ్యాయి. అలాగే హుండీని పగులగొట్టి అందులోని నోట్లను మాత్రం తీసుకెళ్లారు. అలాగే కేజీ కుప్పంలోని నాగూర్ బాషా తన కుమారుడికి పెళ్లి సంబంధం నిమిత్తం ఒకటో తేదీ రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఎవరూ లేకపోవడంతో గురువారం రాత్రి నాగూర్ బాషా ఇంట్లోకి దొంగలు చొరబడి 15 సవర్ల బంగారం, అర కిలో వెండి, రూ.11వేలను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్తంగా..

గ్రామ సభలు

పాలసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా 2026-27 సంవత్సరాలకు పాలసముద్రం, తిరుమలరాజుపురం, నరసింహాపురం, గంగమాంబాపురం, కోదండరామాపురం పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించడానికి శుక్రవారం ఆయా సర్పంచుల అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఎంపీడీవో సతీష్ డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో మార్గరేట్, ఈసీ రామమూర్తి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నింద్రలో డీడీవో కార్యాలయం

నింద్ర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నింద్రలోని డీడీవో కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు కార్యాలయం ఏర్పాటుపై శుక్రవారం పరిశీలన చేశారు. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

విజయపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయపురంలో గాంధీ జయంతి సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి, దివ్యాంగుల శిబిరంలో అన్నదానం చేశారు. నాయకులు కైలాసంయాదవ్, యుగంధర్ రాజు, రాము, మణిరెడ్డి, జలజ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

- ఇబ్బందిపడ్డ జనం, వ్యాపారులు

యాదమరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదమరిలో శుక్రవారం సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ఇటు జనం, అటు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపమే దీనికి కారణంగా ఏఈ గుర్రప్ప గుర్తించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు సూపర్ గిఫ్ట్: భానుప్రకాష్

నగరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు పేదలకు సూపర్ గిఫ్ట్ వంటిదని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ కార్యాలయం నుంచి ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇకపై వ్యవసాయ పనిముట్లను తక్కువ ధరలకు రైతులు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'చెరకు రైతులను ఆదుకోండి'

నగరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధర పెంచి తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కి నగరి నియోజకవర్గంలోని చెరకు రైతులు గురువారం వినతిపత్రం అందించారు.తమిళనాడు ప్రభుత్వం టన్నుకు రూ.4వేలను ప్రకటించిందన్నారు. దీనిపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతులు కె.రవి నాయుడు, ఎం.రవి నాయుడు, నాగభూషణం, మధునాయుడు, హరిబాబు, సురేష్ నాయుడు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

యాదమరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. లక్ష్మయ్య కండ్రిగ గ్రామం వద్ద గురువారం ఉదయం చిత్తూరు - పలమనేరు జాతీయ రహదారిని దాటుతున్న పి.మునిరత్నం (79)ని ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ అతి వేగంతోపాటు నిర్లక్ష్యంగా వాహనాన్నిన నడుపుతూ వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.